# నాన్నారు

"తాతయ్యా! రేపు రాజమండ్రి వెళ్తున్నాను"

మధు మాటలకి తుళ్లిపడ్డారు వెంకట్రామయ్య. నిటారుగా అయి వినకూడనిది విన్నట్టు చూశారు.

ఆయన భావం గ్రహించి అన్నాడు "రాజమండ్రి అంటే... ధవళేశ్వరం బ్రిడ్జి, కాటన్ మ్యూజియం అన్నీ చూసొద్దామంటున్నారు నా ఫ్రెండ్స్..."

"కాని ఆ పక్కనున్న రాజమండ్రిలోనేరా ఆ రాక్షసుడుండేదీ!" విషం కక్కుతున్నట్టుగా అన్నారు.

అర్థమైనా అర్థంకానట్టు చూశాడు మధు.

"అదేరా ఆ త్రాష్ఠుడు! నిన్ను కని పారేసిన మీ నాన్న!" కోపంగా అన్నారాయన.

"హవ్వ! అవేం మాటలండీ. ఎవరైనా వింటే నవ్విపోతారు గాని ఇక ఊరుకోండి" మధు అమ్మమ్మ మధ్యలో కల్పించుకునంది.

"నవ్వితే నవ్వనీవే. నేనేమైనా తప్పు మాట్లాడానా?!" అన్నాడాయన కోపంగా.

"అబ్బో మీరు సత్యహరిశ్చంద్రులు లెండి. మీరెన్నన్నా అతగాడు తండ్రి గాక పోడు వీడు కొడుకు కాకా పోడు. ఏంచేస్తాం అంతా ప్రారబ్ధం. మనమ్మాయికి ఆయుష్షు లేకపోయింది" కళ్లొత్తుకుందామె.

"అదృష్టవంతురాలు గనుకే అలాటి దుర్మార్గుడితో కాపురం చెయ్యాల్సిన కర్మ తప్పింది"

"చాలు చాల్లెండి. అంతకుముందు అమ్మాయి కాపురం చెయ్యనట్టూ అతగాడు మంచిగా ఉండనట్టూ మాట్లాడతారేవిటీ చోద్యంగాకపోతే!"

"నాది చోద్యం. మరి అతగాడు చేసిన నిర్వాకం ఏవిటిట? భూమ్మీద నూకల్లేక వీడిని కని అమ్మాయి హరీమందనుకో. అందుకు వీడే కారణమంటూ పసిగుడ్డు అనైనా చూడకుండా వీడ్ని అసహ్యించుకుంటాడా?" నిలదీశారు వెంకట్రామయ్య.

"అప్పుడా దు:ఖంలో ఆ వేడిలో.....!"

"మరైతే ఆ వేడి తగ్గేక రావచ్చుగా? ఈ పదహారు పదిహేడేళ్లలో ఒక్కసారి కూడా ఎందుకు తొంగిచూడలేదు? నా కొడుకెలా వున్నాడు అవటాని ఒక్కసారైనా ఆరా తీయలేదెంచేతా?" అడిగాడాయన.

"మీరతగాడి నీడని కూడా సహించరని అతడికి తెలుసు" అన్నది మధు అమ్మమ్మ.

"అల్లుడ్ని బాగానే వెనకేసుకొస్తున్నావుగాని అతగాడు నాకు జడిసి రావటం మానుకోలేదు. రెండో పెళ్ళానికి భయపడి ఇక్కడో కొడుకున్నాడన్న సంగతి మరచిపోయాడు. నువ్వేదో అనుకుంటున్నావుగాని వీడు పుట్టేక వీడి వంక ఎందుకు చూళ్లేదో తెలుసా?"

"విశాలాక్షిని చంపి పుట్టాడని!"

"అదంతా లోకాన్ని మభ్యపెట్టడానికి వేసిన ఎత్తు. రెండో పెళ్లికి వీడు అడ్డం అవుతాడని!"

"చాల్లెద్దురూ. నోటికెంతవస్తే అంత అనడమే"

"నేను గనుక మాటల్తో వదుల్తున్నానే మరొకడూ మరొకడూ అయితే నడివీథిలో నిలబెట్టి నిలువునా కడిగేసేద్దుడు ఏమనుకున్నావో"

వారి సంభాషణ వింటూ స్తంభాన్నానుకుని నిలబడ్డాడు మధు. వాడ్నలా చూసి జాలిపడింది అమ్మమ్మ.

"మీ తాతయ్య మాటేం పట్టించుకోకురా మధూ. ధవళేశ్వరమే వెళ్తావో రాజమండ్రే వెళ్తావో వెళ్లు. డబ్బు నేనిస్తాగా. పద భోంచేద్దువుగాని" అతడి చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకెళ్లింది.

వెళ్తూ వెళ్తూ తాతయ్య వంకచూశాడు.

బొగ్గులు రగుల్తున్నట్టుగా మండిపోతున్నారు!

అన్నం వడ్డించి పక్కనే విసనికర్ర పట్టుకుని చతికిలబడింది అమ్మమ్మ.

"ఎలాగూ అంత దూరం వెళ్తున్నవాడివి ఇంకో రెండడుగులేసి మీ నాన్నని కలిసి రారాదుట్రా"

మధు మాట్లాడలేదు.

నిజానికతడు రాజమండ్రి వెళ్లాలనే ఈ ప్రమాణం పెట్టుకున్నాడు. కాని బయటపడదలచుకోలేదు!

"కోపాలూ తాపాలూ ఎల్లకాలమూ ఉంటాయా ఏవిట్రా. మీ తాతదంతా చాదస్తం. తను పట్టినకుందేటికి మూడేకాళ్లంటారు. నువ్వాయన మాటలేం పట్టించుకోకొరేయ్' అన్నదామె.

తలాడించాడు మధు.

"ఇవాళో రేపో ఇంటర్ పాసవుతావు. ఇంకా పై చదువులు చదవాలి. చక్కని ఉద్యోగం రావాలి. ఏదో ఆ స్కూలు వాళ్లు నెలనెలా స్కాలర్‌షిప్ ఇస్తున్నారు గనుక చదువు సాగుతోంది గాని లేకపోతే ఇవన్నీ మీ తాతవల్ల అవుతాయా చెప్పు. ఏదో ఆ కాలపు తిళ్లుగనుక రోగం రొష్టూ లేకుండా బండి లాగించుకొస్తున్నాంగాని మేం మాత్రం ఎన్నాళ్లు బతుకుతాం చెప్పు. ఇన్నాళ్లూ ఎలా గడిచినా ఇకనుంచి తండ్రి చేయూత ఎంతో అవసరంరా మధూ. పెద్దదాన్ని ఎందుకు చెబుతున్నానో విను"

"నన్నేం చెయ్యమంటావు అమ్మమ్మా."

"మీ తాతయ్యకి తెలీకుండా అట్నించటు వెళ్లి మీ నాన్నని కలిసిరారా. భగవంతుడు అతగాడి బుద్ధి మారుస్తాడేమో. నిన్ను చూడగానే ఆదరిస్తాడేమో!"

"నువ్వెళ్లమంటే వెళ్తాను"

"మా బాబే. మాతండ్రే. అమ్మమ్మంటే నీకెంత ఇదిరా. నిన్ను తప్పకుండా దేవుడు చల్లగా చూస్తాడ్రా. ఇంటికప్పుకింద నిలబడి చెబుతున్నాన్రా. నీ కంతా మంచే జరుగుతుంది..." చెమర్చిన కళ్లు పమిట చెంగుతో తుడుచుకుంటూ అంది.

చెయ్యి కడుక్కుని గదిలో కెళ్లాడు.

అమ్మమ్మా తాతయ్యా ఇరుగుపొరుగు వారితో లోకాభిరామాయణంలో పడ్డారు.

పాత ట్రంకు పెట్టెలన్నీ వెదికాడు మధు. ఎక్కడైనా తండ్రి ఫోటో కన్పిస్తుందేమోనని వాడి ఆశ. తల్లి ఫోటోలు చాలానే కన్పించాయి. కాని వాటిలో తండ్రిలేడు. ఇద్దరూ కలిసున్న ఫోటోల్లో సైతం తండ్రి ఫోటోని కత్తిరించేశారు!

తన గదిలోకెళ్లి పడుకున్నాడు.

తండ్రి ఎలావుంటారో! తనని గుర్తుపడతారా? పలకరిస్తారా? ఎన్నో ప్రశ్నలు! మరెన్నో ఊహలు!

తండ్రివుండికూడా అతడి ముఖం చూడని కొడుకు బహుశా ఈ భూమ్మీద తనొక్కడేనేమో! తనంత దురదృష్టవంతుడు ఎక్కడా ఉండడు!

ఏడుపొచ్చింది. తలగడలో తలదూర్చి ఏడ్చేశాడు.

ఆ రాత్రి మధు నిద్రపోలేదు. పిచ్చి ఊహలూ పచ్చి ఊహలూ అతడ్ని తిన్నగా నిద్రపోనివ్వలేదు. ఉద్వేగంతో ఉత్కంఠతో ఊగిపోతూనే ఉన్నాడు రాత్రంతా.

పది లంఖణాలు చేసినవాళ్లావున్న మనవడ్ని చూసి బుగ్గలు నొక్కుకుంది అమ్మమ్మ.

"అలా అయిపోయావేంరా మధూ!"

"ఏం లేదు అమ్మమ్మా"

"మీ నాన్న ఏవంటాడోనని బెంగపెట్టుకున్నావా? అతడు మంచివాడేరా. మీ పినతల్లే గయ్యాళి అని విన్నాను. అయినా నువ్విప్పుడు ఎదిగి వచ్చావాయె. చిన్నపిల్లాడివి కాదు కదా చెయ్యి విదిలించడానికీ నోరు పారేసుకోడానికీ! ఒకవేళ పొరబాటున ఏమైనా అన్నా పట్టించుకోకురా మధూ. నీ బంధం ఆయన్తోగాని ఆవిడతో కాదు కదా!" అందామె.

అన్నిటికీ బుద్ధిమంతుళ్లా తలూపి బయల్దేరాడు.

బస్సు వెళ్తోంది. కిటికీ పక్కన కూర్చుని పచ్చని చేలనీ కాలువనీ చూస్తున్నాడు. మెదడు మాత్రం తండ్రికి ఎదురుపడబోయే సంఘటన గురించే ఆలోచిస్తోంది. రకరకాల సమాధానాలని సిద్ధం చేసుకొంటోంది.

రాజమండ్రిలో బస్సుదిగాడు.

అడ్రస్సు చెప్పి రిక్షా ఎక్కాడు.

అమ్మమ్మ చెప్పిన ఇంటి గుర్తులు నెమరేసుకుంటూ పరిశీలనగా చూడసాగాడు.

రిక్షా ఆగింది. ఇంటి ప్రహారీగోడ కతికించిన పాలరాతి పలకమీద పడిందతడి దృష్టి.

కామేశ్వరరావు. సదాలక్ష్మి.

మధు గుండె మూల్గింది. విశాలాక్షి ఉండాల్సినచోట సదాలక్ష్మి!

రిక్షాకి డబ్బులిచ్చి గేటుతీసుకుని లోపలికెళ్లాడు.

నిజానికిది తనిల్లు. తను స్వేచ్ఛగా మసలాల్సిన ఇల్లు. కాని పరాయి ఇంట్లో కెళు తున్నట్టు సంకోచిస్తూ వెళ్లాల్సొస్తోంది!

గుమ్మంలో నిలబడ్డాడు. ఏమనిపిలవాలి? గొంతు పట్టేసినట్టయ్యింది. కళ్లల్లోకి నీళ్లొచ్చాయి.

పదేళ్లమ్మాయి బయటికొచ్చింది. చెల్లెలేమో?!

"ఎవరుకావాలీ?"

"నాన్న... నాన్నగారు..."

ఎగాదిగా చూసి లోపలికెళ్లింది.

"మమ్మీ! డాడీకోసం ఎవరో అబ్బాయి వచ్చాడు"

కర్టెన్ ప్రక్కకి జరిపి చూసిందొకావిడ. బహుశా సదాలక్ష్మేమో!

ఆమె కళ్లు విప్పారాయి.

బయటికొచ్చి "నువ్వు... మధువా?" అనడిగింది.

తనెవరో ఎలా చెప్పటమా అని సతమతమవుతోన్న మధు ఆమె మాటలకి ఆనందపడిపోయాడు. ఎంతో రిలీఫ్‌గా ఫీలవుతూ తలాడించాడు.

"పరాయివాళ్లా అలా నిలబడిపోయావేం. రా రా... అమ్మమ్మా తాతయ్యా బావున్నారా..." మధు భుజాల చుట్టూ చేయివేసి మరీ లోపలికి తీసుకెళ్లింది.

అక్కడ హాల్లో టీ.వీ. చూస్తోన్న రఘూ శ్యామలా మధు వంక చిత్రంగా చూశారు.

"మీ అన్నయ్యర్రా. మంచినీళ్లు తెచ్చివ్వు శ్యామలా"

చటుక్కున లేచి వెళ్లి చల్లని మంచినీళ్లు తెచ్చిచ్చింది. చక్రాల్లాంటి కళ్లతో చూస్తూ పలకరింపుగా నవ్వింది.

మధు కూడా నవ్వేడు.

రఘు వచ్చి పక్కనేకూర్చుంటూ "ఏం చదువుతున్నావు" అడిగాడు.

"సీనియర్ ఇంటర్" చెప్పాడు మధు.

"నేను టెన్త్. చెల్లెలు సెవెంత్..."

అలాగా అన్నట్టు తలాడించాడు మధు.

"ఎలా చదువుతున్నావు మధూ. ఎమ్సెట్‌కి బాగా ప్రిపేరవుతున్నావా?" సదాలక్ష్మి అడిగింది.

"ఊహూ. మా ఊళ్లో కోచింగ్ సెంటర్లు లేవు"

"అయ్యో అలాగా. నువ్వింకా ఇంజినీరువవుతావని మీ నాన్న ఆశపడుతున్నారే. కోచింగు లేకపోతే సీటు రావడం కష్టం. నువ్విక్కడికొచ్చెయ్యి మధూ. ఇక్కడుండి చదువుకుందువుగాని..."

ఇది కలో నిజమో అర్థంగాకుండా వుంది మధుకి. సవతితల్లి ఒక రాక్షసి అని విన్నాడు. గయ్యాళిగా సినిమాల్లో చూశాడు. ఆవిడ తనని ఇంట్లోకి రానివ్వదనీ కర్ర తీసుకుని తరిమేస్తుందనీ భయపడ్డాడు. కాని ఈవిడ...! ఇలాటివాళ్లు కూడా ఉంటారా?!

నమ్మలేకపోతున్నాడు. అలాగని నమ్మకుండా ఉండలేకపోతున్నాడు!

ఒక ప్లేటులో సున్నుండలా పకోడీలూ పెట్టుకునొచ్చిందామె. మధు తింటుంటే అతడి కబుర్లూ అమ్మమ్మ కబుర్లూ అడిగి తెలుసుకుందామె. రఘూ శ్యామలా కూడా అతడితో కలసిపోయారు.

వీళ్లంతా మంచివాళ్లలానే ఉన్నారు. మరి నాన్న ఎలా ఉంటారో! తనని చూస్తూనే తల్లిని చంపి పుట్టిన దురదృష్ట జాతకుడివంటూ విరుచుకుపడితే? నీ ముఖం నాకు చూపించొద్దని కళ్లెర్రజేస్తే?

ఆలోచనలు పరిపరివిధాల పోతుంటే అన్యమనస్కంగానే కబుర్లు చెప్పాడు. భోం చేశాడు.

కామేశ్వర్రావు వచ్చారు. విశాలాక్షి నోట్లోంచి ఊడిపడినట్టుగావున్న మధుని చూస్తునే గుర్తుపట్టేశారు.

"మధూ!" కంపిత స్వరంతో పిలిచి ఆప్యాయంగా ఒళ్లో కూర్చోబెట్టుకున్నారు.

"బాగున్నావా" తలాడించాడు మధు.

"అచ్చం మీ అమ్మలానే ఉన్నావురా. చదువు బాగా సాగుతోందా. నెలనెలా డబ్బు అందుతోందా?"

విస్మయంగా చూశాడు.

"నీ చదువుకని స్కూలు ద్వారా డబ్బు పంపిస్తున్నారు మీనాన్న. మీనాన్న డబ్బంటే మీ తాతయ్య తీసుకోరని స్కాలర్‌షిప్ అని చెప్పిస్తున్నారు" వివరించింది సదాలక్ష్మి.

అశ్రునయనాలతో తండ్రిని చూశాడు మధు.

"నీకు చాలా అన్యాయం చేశాన్రా మధూ. తండ్రి ప్రేమా, లాలనా ఏమీ దక్కకుండా చేశాను. ఏం చెయ్యను చెప్పు. ప్రాణానికి ప్రాణమైన మీ అమ్మ మరణానికి కారకుడివని...!" ఆపైన చెప్పలేకపోయారాయన.

"మీ అమ్మంటే నాన్నగారికెంతో ప్రేమ. ఆరాధన. మొదట్లో నువ్వంటే విముఖత చూపినా తర్వాత నిన్ను తీసుకురావాలని ప్రయత్నించారుగాని మీతాతయ్య పడనివ్వలేదు. నేనేదో విషం పెట్టేస్తానని భయపడ్డారు"

సదాలక్ష్మి వంక చూళ్లేక తలదించేసుకున్నాడు మధు.

"పెద్దవాళ్ళదంతా మూర్ఖత్వం. అనవసరపు పట్టింపులెక్కువ. నువ్వు అవేమీ పట్టించుకోకు మధూ. మనింటి కొచ్చెయ్. అంతా కలిసి వుందాం. మీ అమ్మ ఆత్మ ఎంతో సంతోషిస్తుంది మధూ..."

కన్నతల్లివచ్చి అడుగుతున్నట్టన్పించింది మధుకి.

"అమ్మా!" అన్నాడు ఆర్తిగా.

"నా బిడ్డ నన్ను తల్లిగా ఒప్పుకున్నాడండీ. రా బాబూ రా. మీ అమ్మకి దణ్ణం పెట్టుకుందువుగాని రా"

వెర్రి సంబరంతో పూజగదిలోకి తీసుకెళ్లింది.

పూజా మందిరంలో దేవుడిపటాల సరసనవుంది తల్లిఫోటో.

ఫోటోలోని తల్లివంక చూశాడు. చల్లగా దీవిస్తూ చూస్తోంది. దు:ఖం పొంగివచ్చింది.

"ఏడవకు మధూ..." కొడుకుని దగ్గరకి తీసుకుని అనునయించింది.

"ఇవాల్టితో నాపాపం ప్రక్షాళితమైందండీ" ఎన్నేళ్లనుంచో భావం ఆమెలో గూడుకట్టుకునుందోగాని అదిప్పుడు కరిగి కన్నీరై కొట్టుకుపోయింది.

"నా శాపం కూడా..." అన్నారు కామేశ్వర్రావు.

"నాన్నారు!" తండ్రిని చుట్టేశాడు మధు.

'అమ్మేకాదు నాన్నా గొప్పవారే. నాన్న ప్రేమా అమృతతుల్యమే' మనస్సు ఆనందోత్సాహాలతో ఎగసిపడుతోంటే అనుకున్నాడు మధు.

"తాతయ్యకి చెప్పకుండా వచ్చావుకదూ?"

"అమ్మమ్మకి చెప్పేను..."

"అయితే బయల్దేరు..."

గంభీరంగా మారిన ఆయన వదనం వంక భయంగా చూశారు సదాలక్ష్మి, మధూ.

"మనతో ఉండిపోతాడండీ..." సదాలక్ష్మి అంది.

"ఆ గడియ ఇంకారాలేదు. రా మధూ..."

ఉక్రోషం వచ్చింది. ఎవ్వరికీ వెళ్తున్నానని కూడా చెప్పకుండా విసావిసావచ్చి స్కూటర్ వెనక కూర్చున్నాడు మధు.

బస్టాండులో చక్కెరకేళీలూ, ఆపిల్ పళ్లూ కొనివ్వగా మౌనంగా తీసుకున్నాడు మధు. బస్సు రెడీగా వుంది.

ఎక్కబోతోంటే ఆపారు కామేశ్వర్రావు.

"నీకు రావాలని అన్పించినప్పుడల్లా వస్తూండు. నీ చదువుగురించీ ఖర్చుగురించీ ఇదవ్వకు. నువ్వెంత వరకూ చదువుతానంటే అంతవరకూ చదివిస్తాను. ప్రైవేట్లు చెప్పించుకో. కోచింగు తీసుకో. ఎంత ఖర్చు అయినా ఫర్లేదు. నువ్వు ఇంజినీరువి కావాలి. మీ అమ్మ కోరికది. తెల్సిందా?" అన్నారాయన.

తలూపాడు మధు.

"నిన్ను వెనక్కి పంపిస్తున్నందుకు బాధగా ఉండొచ్చు. కాని తప్పదు. నేన్నీ కన్నతండ్రిని మాత్రమే. ఒక తండ్రి నిర్వర్తించాల్సిన అన్ని బాధ్యతలూ నిర్వర్తించి నిన్నింత వాడ్ని చేసిన మహానుభావుడు తాతయ్య. ఆయన్ని బాధపెట్టకూడదు. నువ్వు నా దగ్గరికొస్తే మాకందరికీ సంతోషమే. కాని ఆయనెంత క్షోభపడతారో విలవిల్లాడతారో ఒక్కక్షణం ఆలోచించు. నీకింతచేసిన ఆయన ఋణం ఇలా తీర్చుకుంటావా చెప్పు?"

మధు కళ్లనుంచి కన్నీళ్లు స్రవించాయి. గబుక్కున వంగి తండ్రి పాదాలకి నమస్కరించి బస్సెక్కేశాడు మధు.

బస్సు కదిలింది. గమ్యంవైపు సాగిపోతోంది. కన్పిస్తున్నంతవరకూ కన్నీటి పొరల్లోంచి తండ్రివంక తదేకంగా చూస్తూనే ఉన్నాడు మధు.

**(స్వాతి సపరివారపత్రిక)**

**2.6.2000**